## క్లుప్తంగా

### ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్స్‌లు



**ఎల్‌బీనగర్:** బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని పలు కాలనీలలో విద్యుత్ ఫ్యూజ్ బాక్స్‌లు ప్రమాదకరంగా మారాయి. కాలనీలలో గోడలకు అమర్చిన రక్షణ లేని ఫ్యూజ్ బాక్సులతో ప్రజలు, మూగజీవాలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పలు కాలనీలవాసులు ఆందోళన చెందుతున్నారు. మూతలు ఏర్పాటు చేయకుండా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయభ్రాంతులు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు ఇప్పటికైనా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ఫ్యూజ్ బాక్స్‌లు తొలగించి రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

### మలక్‌పేట మార్కెట్‌కు భారీగా ఉల్లి దిగుమతి



**చాదర్‌ఘాట్:** మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్‌కు వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి బుధవారం భారీగా ఉల్లి దిగుమతులు వచ్చాయని మార్కెట్ ఎస్జీఎస్ దామోదర్ తెలిపారు. మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి దాదాపు 70 లారీలు, సిద్దిపేట జిల్లా నుంచి 15 లారీల ఉల్లి తిగుమతి అయినట్లు తెలిపారు. మొదటి రకం ఉల్లి క్వింటాలుకు రూ. 2300, రెండవ రకం కొత్త ఉల్లికి రూ. 1500 ధర పలికిందని ఆయన తెలిపారు. ఉల్లి రాకతో మార్కెట్‌కు ఆదాయం రోజుకు దాదాపు రూ. 5 లక్షలు వస్తున్నట్లు వివరించారు. ఈ ఆదాయం మూడు నెలల పాటు ఉంటుందన్నారు. కొత్త ఉల్లి సీజన్ మరో వారం రోజులు పడుతుందని అందుకని ఉల్లి ధర తగ్గే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైతే ఉల్లి ధర నిలకడగా ఉందని ఆయన వెల్లడించారు.

### బీఆర్‌ఎస్‌కు ప్రజాదరణ తథ్యం



**చైతన్యపురి:** ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ మహాసభకు చైతన్యపురి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జిన్నారం మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ పార్టీ దేశవ్యాప్తంగా ప్రజాదరణ పొందటం ఖాయం అన్నారు. నాయకులు పవన్, రమణారెడ్డి, నరహరి పాల్గొన్నారు.

### ఎన్టీఆర్‌కు జస్టిస్ చంద్రకుమార్ నివాళి

**హస్తినాపురం:** బడుగు బలహీన వర్గాలు, వెనుకబడిన వర్గాల ప్రజలలో రాజకీయ చైతన్యం తీసుకొచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావుకే దక్కిందని ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బుధవారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ... సీఎంగా ఎన్టీఆర్ చేపట్టి విజయవంతంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు ఎంతో ఆదర్శమన్నారు. కార్పొరేట్ విద్యానియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు, రాగిపణి, సతీష్ కుమార్, యోగేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

### స్వచ్ఛత-పరిశుభ్రతే లక్ష్యం కావాలి

బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి



**చైతన్యపురి:** డివిజన్‌లో స్వచ్ఛత-పరిశుభ్రత సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమమహేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్ సమస్యలు, సమగ్ర అభివృద్ధిపై తయారు చేసిన కరపత్రాలను వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... స్వచ్ఛ గడ్డిఅన్నారం సాధన కార్యక్రమంలో కాలనీవాసులు భాగస్వాములు కావాలని కోరారు. ఇంటి పరిసరాల్లో చెత్త వేయవద్దని జీహెచ్‌ఎంసీ చెత్త ఆటో వారికి మాత్రమే ఇవ్వాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరుగా ఇవ్వాలన్నారు. డివిజన్ సమస్యల పరిష్కారానికై ఆయా విభాగాల ఫోన్ నంబర్లతో ఉన్న కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తామన్నారు. భవన నిర్మాణాల వ్యర్థాలను తొలగించేందుకు ఫోన్: 91009 27073, చెట్ల కొమ్మలు తీసేందుకు ఫోన్: 81217 68656, చెత్త తీసుకుని పోకపోతే ఫోన్: 88018 26666, వీధి దీపాల సమస్యలపై ఫోన్: 96423 87877, దోమలు, క్రిమి సంహారక మందుల పిచికారీ చేసేందుకు ఫోన్: 95507 45801, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సంబంధ సమస్యలపై 155313 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని కార్పొరేటర్ సూచించారు.

# అలంకారప్రాయం!

- నిరుపయోగంగా లలితానగర్ మోడల్ మార్కెట్ భవనం
- సంవత్సరాలు గుడుస్తున్నా అందుబాటులోకి రాని వైనం
- అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై సర్వత్రా ఆగ్రహం



నిరుపయోగంగా ఉన్న లలితానగర్‌లోని మోడల్ మార్కెట్ భవనం (వృత్తంలో పగిలిన అద్దాలు)

**నాగోలు:** నాగోలు డివిజన్ లలితానగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ అధికారులు రూ. 83 లక్షలు వెచ్చించి నిర్మించిన మోడల్ మార్కెట్ భవనం నిరుపయోగంగా తయారైంది. అందులో కొందరికి దుకాణాలను సైతం కేటాయించారు. సంవత్సరాలు గడుస్తున్నా సదరు దుకాణాలు తెరుచుకోలేదు. మోడల్ మార్కెట్ అందుబాటులోకి వస్తుందని అనుకున్న నాగోలు డివిజన్ పరిధిలోని సాయినగర్, లలితానగర్, రాఘవేంద్ర కాలనీ, గణేష్‌నగర్, చాణాక్యపురి కాలనీ వాసులకు నిరాశే ఎదురైంది. నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్ భవనం కాస్తా ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- మంత్రి కేటీఆర్ 2017లో అమలు చేసిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా జీహెచ్‌ఎంసీ నిధులతో లలితానగర్‌లో జీ ప్లస్-1 పద్ధతితో మోడల్ మార్కెట్ భవనాన్ని నిర్మించారు.
- మార్కెట్ భవనంలో ఉన్న దుకాణాల తీసుకున్న వారు వ్యాపారం చేయడం లేదు.
- భవిష్యత్‌లో ఏ విధంగా వ్యాపారాలు అభివృద్ధి చేసుకోవచ్చనే అంశంపై అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది.
- గదుల్లో దుమ్ము, ధూళి పేరుకుపోయింది.
- చీకటి పడితేచాలు కొంత మంది మద్యం సేవిస్తున్నట్లు కాలనీ వాసులు తెలిపారు.
- అధికారులు స్పందించి మోడల్ మార్కెట్‌ను అందుబాటులో తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.
- అవగాహన లేమి, ముందు చూపులేని అధికారులకు తోడు ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంగా ఫలితంగా ప్రజాధనం వృథాగా మారింది.

#### టెండర్లు పిలిచినా రావడం లేదు

గతంలో టెండర్ దక్కించుకున్న వారు పనులు చేయలేదు. వారికి నోటీసులు ఇచ్చాం. ఇప్పటివరకు స్పందించలేదు. ఎన్ని సార్లు టెండర్లు పిలిచినా పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ విషయంపై జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయానికి నివేదిక పంపాము. త్వరలోనే మోడల్ మార్కెట్లపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

– మారుతీదివాకర్, డిప్యూటీ కమిషనర్, సర్కిల్-3

## జీహెచ్‌ఎంసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ



కార్మికులతో మాట్లాడుతున్న కీసర నర్సిరెడ్డి

**ఎల్‌బీనగర్:** జీహెచ్‌ఎంసీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి ఆరోపించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని బుధవారం హయత్‌నగర్‌లోని పలు ప్రాంతల్లో పారిశుద్ధ్య కార్మికులను కలసి వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ... పారిశుద్ధ్య కార్మికుల విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలు ప్రాంతలలో జరిగిన ప్రమాదలలో ఐదుగురు కార్మికులు మృతి చెందగా, మరి కొంత మంది గాయపడ్డారని తెలిపారు. ప్రమాదానికి గురైన కుటుంబాలను వెంటనే ఆదుకొని వారికి ప్రభుత్వం భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ హయత్‌నగర్ సర్కిల్ అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పండ్ల పంపిణీ



**మన్సూరాబాద్:** మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతిని పురస్కరించుకుని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సింగిరెడ్డి మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అనాథాశ్రమంలోని అనాథలు, హయత్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మరాఠి భిక్షపతి, రవీందర్ ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, కరణ్‌చౌదరీ, జైభారత్‌రెడ్డి, జనిగే మహేందర్, సుధాకర్‌గౌడ్, జాన్‌రెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## లోక కల్యాణార్థం యజ్ఞం అభినందనీయం

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



యజ్ఞ మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**లింగోజిగూడ:** లోక కల్యాణార్థం కర్మన్‌ఘాట్‌లోని శ్రీ లక్ష్మీ కన్వెన్షన్‌లో చేపట్టనున్న శ్రీ సర్వ సౌభాగ్య దేవీత్రయ గీతాజ్ఞన యజ్ఞ మహోత్సవంలో భాగంగా మొదటి రోజు యాగశాల ప్రదక్షిణం, శ్రీఓంకార ప్రణవ పతాకవిష్కరణ, మహాగణపతి పూజ, అఖండ దీపస్థాపన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి యజ్ఞ మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... లోక కల్యాణార్థం యజ్ఞ మహోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమానికి భక్తులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వహకులు మురుకుంట్ల మురళీ శర్మ, సూరిశెట్టి శ్రీనివాస్ గుప్తా, శశిధర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## బాక్స్ టైప్ డ్రైనేజీతో ముురుగు సమస్యకు చెక్



బాక్స్ టైప్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

**చంపాపేట:** రాజిరెడ్డినగర్, ఎస్‌జీఆర్ కాలనీలలో ప్రారంభించిన బాక్స్ టైప్ డ్రైనేజీ నిర్మాణంతో ఏటా వర్షాకాలంలో చోటుచేసుకునే వరద ముంపు సమస్యకు చెక్ పడుతుందని చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన సర్కిల్ అధికారులతో కలసి డ్రైనేజీ పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సర్కిల్ ఏఈ సురేష్, కాలనీ నేతలు సాయిప్రసాద్, సాయిరాం, నాయకులు పాశం శ్రీశైలం, అంజి పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

జీఎస్‌ఐటీఐ డీడీజీ వెంకటేశ్వర్‌రావు

**మన్సూరాబాద్:** అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ పలు అంశాలను నేర్చుకునేందుకు యువ జియో సైంటిస్టులకు శిక్షణ గొప్ప అవకాశమని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (జీఎస్‌ఐటీఐ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (హెడ్ మిషన్-5) సి.హెచ్.వెంకటేశ్వర్‌రావు అన్నారు. నాగోలు డివిజన్ బండ్లగూడలోని జీఎస్‌ఐటీఐలోని ఎంఎస్ కృష్ణన్ ఆడిటోరియంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జియో సైంటిస్ట్‌ల కోసం రిమోట్ సెన్సింగ్, డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్‌పై 14వ అంతర్జాతీయ శిక్షణ కోర్సును బుధవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీడీజీ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ... విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పాన్సర్‌తో ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కార్యక్రమం కింద శిక్షణ కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడే వృత్తి పరమైన నైపుణాన్ని సృష్టించేందుకు, సాంకేతికతను పంచుకోవటానికి కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. 10 దేశాల నుంచి 15 మంది యువ జియో సైంటిస్టులు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారన్నారు. శిక్షణకు హాజరైన యువ సైంటిస్టులకు స్టడీ మెటీరియల్ కిట్స్‌ను అందజేశారు. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మాథ్యూజోసెఫ్, టెక్నికల్ కో ఆర్డినేటర్, డైరక్టర్ డాక్టర్ నిషారాణి, డైరక్టర్లు డాక్టర్ భాటియ, డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## చెట్ల కొమ్మల తొలగింపు

**ఎల్‌బీనగర్:** పలు కాలనీల్లో చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్న కారణంగా వీధి దీపాల వెలుగు రావటం లేదని, కొమ్మలు తొలగించేలా చర్యలు తీసుకుంటున్నామని బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఎస్‌కేడీనగర్‌లో వీధి దీపాలు, విద్యుత్ తీగలకు అడ్డు గా ఉన్న చెట్ల కొమ్మలను బుధవారం విద్యుత్ సిబ్బందితో కలసి తొలగించారు. కార్యక్రమంలో లైన్‌మెన్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## చెవిటి, మూగ బాలుడి అదృశ్యం



అదృశ్యమైన బాలుడు

**మలక్‌పేట:** చెవిటి, మూగ బాలుడు అదృశ్యమైన సంఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నవీన్ సమాచారం మేరకు... చైల్డ్ హెల్ప్ లైన్ వారు ఈ నెల 9 తేదీన 10 సంవత్సరాల వయసున్న బాలుడిని మలక్‌పేట ఫిన్ బధిర ఆశ్రమ పాఠశాలలో చేర్పించారు. ఆ బాలుడు 13 తేదీన సాయంత్రం ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. నిర్వాహకులు అతని కోసం చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేనందున వారు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు ఫోన్స్: 87126 60572, 87126 61267లలో సమాచారం ఇవ్వాలని కోరారు.

## యువకుడి హత్య కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగారం

**రంగారెడ్డిజిల్లా కోర్టులు:** యువకుడి హత్య కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ. 2000ల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 8వ అదనపు జిల్లా కమ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సుగలి నారాయణ తీర్పు చెప్పారు. 8వ అదనపు జిల్లా కమ్ సెషన్స్ కోర్టు ఏపీపీ గంగా రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... 2015వ సంవత్సరం ఫిబ్రవరిలో డ్రైవర్ మల్లేశ్(30) సహాయకుడు సత్తయ్య(50), విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు లారీ(ఏపీ29టీబీ5115)లో ఇనుము స్క్రాప్ తరలిస్తుండగా మార్గ మధ్యలో నిందితుడు మహమద్ ఫైజర్ అలీ(27) లిఫ్ట్ అడగడంలో లారీ ఎక్కించుకున్నారు. నార్కట్‌పల్లి సమీపంలోకి రాగానే డ్రైవర్ మల్లేశ్ తనకు నిద్ర వస్తుందని చెప్పడంతో నిందితుడు తాను డ్రైవింగ్ చేస్తానని నమ్మబలికి లారీ పెద్దఅంబర్‌పేట్ చేరుకోగానే సహాయకుడు సత్తయ్యను టైర్లలో గాలి పరిక్షించమని పంపించి నిద్రిస్తున్న డ్రైవర్‌తో సహ పరారయ్యాడు. క్యాబిన్‌లో నిద్రిస్తున్న డ్రైవర్‌ని స్పృహతప్పేలా నిదింతుడు జాకీ రాడ్‌తో తీవ్రంగా గాయపరిచి తుక్కుగూడా సమీపంలో ఔటర్ రింగ్ రోడ్‌పై అర్ధరాత్రి వదిలి వెళ్లాడు. మరుసటి రోజు రక్తపు మడుగులో పడి ఉన్న మల్లేశ్‌ను ఆస్పత్రికి తరలించగా మృత్యువుతో పోరాడి మరణించాడు. మృతుడి తండ్రైన సహాయకుడు సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రంగంలోకి దిగిన పహాడీషరీఫ్ పోలీసులు విచారణ అధికారి కె.సుదర్శన్ రెడ్డి సమక్షంలోని బృందం సి.ఎచ్.యాదయ్య, గోపాల్ కేసును ఛేదించి నిందితుడిని వెహికల్ చెకింగ్‌లో చాకచక్యంగా అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడు ఈ తరహా నేరాలు అలవాటుగా మార్చుకున్నాడని తెలియడంతో లోతుగా విచారణ చేసిన పోలిసుల బృందం నిందితుడికి రిమాండుకు తరలించి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసు విచారించిన న్యాయమూర్తి నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు పైమేరకు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

వనస్థలిపురం పనామా చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



# అందరివాడు ఎన్టీఆర్

పార్టీలకు అతీతంగా నాయకుల నివాళి

**వనస్థలిపురం:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతిని బుధవారం ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహించారు. ఎల్‌బీనగర్ వనస్థలిపురం పనామా చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఇకపై వనస్థలిపురం పనామా చౌరస్తాను ఎన్టీఆర్ చౌరస్తాగా పిలవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, టీఆర్‌ఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, బీజేపీ జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కాంగ్రెస్ ఎల్‌బీనగర్ కో ఆర్డినేటర్ మల్‌రెడ్డి రాంరెడ్డి, స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, జస్టిస్ చంద్రకుమార్, నాయకులు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, చింతల రవికుమార్, అనిల్ చౌదరి, నర్సింహారావు, చెన్నోజు శ్రీనివాసులు పాల్గొన్నారు. యలమంచిలి ఫౌండేషన్ ఫౌండేషన్ ప్రతినిధి భానుప్రసాద్, నాయకులు కృష్ణమూర్తి, నూతి శ్రీనివాస్, విజయ్ నేత, రాజేష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. లింగోజిగూడలో టీడీపీ కార్యదర్శి చిత్తలూరి వెంకటేశ్వర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షుడు శేఖర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**కుర్మగూడలో...**

**చంచల్‌గూడ:** రాజకీయ పార్టీని స్థాపించి తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడిన ఘనత దివంగత నందమూరి తారక రామారావుకు దక్కుతుందని ఎన్టీఆర్ అభిమాన సంఘం పాత బస్తీ అధ్యక్షుడు బర్ల శ్రవణ్‌కుమార్ అన్నారు. కుర్మగూడలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన నివాళులర్పించారు. నాయకులు అల్వాల్ శివకుమార్, కట్ట సుదర్శన్, రాము, గణేష్, శ్రీనివాస్, కుమార్, లావణ్య, రూపరాణి, ఆండాళు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



కుర్మగూడలో నివాళులర్పిస్తున్న అభిమానులు

## బీసీల రిజర్వేషన్ పెంచాలని కోటి సంతకాల సేకరణ



సంతకాలను సేకరిస్తున్న బీఎస్పీ నాయకులు

**లింగోజిగూడ:** రాష్ట్రంలోని పులులు, సింహాలు లాంటి వన్యప్రాణుల లెక్కలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని... అయితే బీసీల లెక్కలు మాత్రం లేకపోవడం దారుణమని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి గుండెల ధర్మేందర్ అన్నారు. బీసీలకు 52 శాతం రిజర్వేషన్‌లను కల్పించాలనే డిమాండ్‌తో బుధవారం ఎల్‌బీనగర్ ఓల్డ్ విలేజ్, ఎస్‌బీహెచ్ కాలనీలలో బీఎస్పీ ఎల్‌బీనగర్ కార్యదర్శి కట్ల కుమార్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ధర్మేందర్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం వెంటనే బీసీల జనగణన చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ ఎల్‌బీనగర్ ఇంచార్జులు పి.అశోక్ యాదవ్, జక్క యాదగిరి, ప్రధాన కార్యదర్శి వేముగంటి సంపత్, నాయకులు వినయ్‌కుమార్, కంసాని నరేష్, రాజ్‌కుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## వివాదాస్పద స్థలంలో మళ్లీ గుడిసెలు

**సైదాబాద్:** సైదాబాద్ డివిజన్ పరిధిలోని లోకాయుక్త కాలనీలో కోర్టు ఆదేశాలతో ఇటీవల రెవెన్యూ అధికారులు 850 గజాలలోని గుడిసెలను తొలగించారు. అయితే తిరిగి అక్కడ గుడిసెలు వేసుకోవడం కొంతసేపు ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నెల 5న రెవెన్యూ అధికారులు లోకాయుక్త కాలనీలోని 37 గుడిసెలను ఖాళీ చేయించి వారికి ఎస్బీహెచ్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో పునరావాసం కల్పించిన విషయం విదితమే. అయితే బుధవారం తెల్లవారుఝామున గుడిసెవాసులు మూకుమ్మడిగా వచ్చి బలవంతంగా అక్కడి ప్రహరీని కూల్చిలోనికి ప్రవేశించారు. గుడిసెలకు కూల్చివేయడంతో తాము నిరాశ్రయులయ్యామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయించాలని వారు కోరారు.

## సమస్యలపై జీఎంకు కార్పొరేటర్ వినతి



జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట:** మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి బుధవారం జలమండలి జీఎం అశోక్‌ను స్థానిక కార్యాలయంలో కలిశారు. పెండింగ్‌లో ఉన్న పనులు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులపై జీఎంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... మ్యాన్ హోల్స్ సిమెంట్ ప్లాస్టరింగ్, నూతన మ్యాన్‌హోళ్ల నిర్మాణం చేపట్టాలని కోరామన్నారు. రామాలయ పరిసర ప్రాంతాలలో డ్రైనేజీ సమస్య తీవ్రతను వివరించామన్నారు. పైప్‌లైన్ నిర్మాణం కోసం రోడ్లు తవ్వి సరిగా పూడ్చకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. డ్రైనేజీ లీకేజీలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. వాటర్ వర్క్స్ ఏరియా మేనేజర్ చంద్రునాయక్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## సైక్లింగ్ ట్రాక్, ఫుట్‌పాత్ పనులను వేగవంతం చేయాలి



నాగోలులో సైక్లింగ్ ట్రాక్, ఫుట్‌పాత్ పనులను పరిశీలిస్తున్న జెడ్‌సీ పంకజ, అధికారులు

జెడ్‌సీ పంకజ

**నాగోలు:** ఉప్పల్ చౌరస్తా నుంచి ఎల్‌బీనగర్ చౌరస్తా వరకు నిర్మించే సైక్లింగ్ ట్రాక్, ఫుట్‌పాత్ పనులను బుధవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ పంకజ, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మారుతీదివాకర్ పరిశీలించారు. నాగోలు చౌరస్తా వద్ద జరుగుతున్న మోడల్ కారిడార్ అభివృద్ధి పనులను పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులతో జెడ్‌సీ చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు వేగవంతంగా చేయాలని అదేశించారు. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.